
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 25 జూలై 2025





ముక్కంటి ఆలయ ప్రక్షాళన

ఏడాదిలో 1 ఏం చేశారు?

బలమైన రాజకీయ నేపథ్యమున్న కుటుంబం ఆయనది. తండ్రి వైపు తాత గంగసుబ్బరామిరెడ్డి శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా పనిచేయగా, తండ్రి గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా చేశారు. తల్లివైపు తాత పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు. వాయల్పాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేశారు. ఈ వారసత్వం అందిపుచ్చుకుని రాజకీయాల్లో అడుగుపెట్టారు బొజ్జల సుధీర్‌రెడ్డి. 2019 ఎన్నికల్లో శ్రీకాళహస్తి నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయినా రాజకీయాల్లో క్రియాశీలంగానే కొనసాగారు. 2014లో గెలిచి అసెంబ్లీలో తొలి అడుగుపెట్టారు. తొలి ఏడాది కాలంలో ఆయన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటి? ప్రజలు ఆయన నుంచి ఏమి ఆశిస్తున్నారు? ఇంకా చేయాల్సినవి ఏమిటి? మలి ఏడాది లక్ష్యాలుగా వేటిని నిర్దేశించుకున్నారు... ఈ అంశాల సమాహారం...

- వివరాలు 8లో -



● నేటి నుంచి ప్రారంభం

తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నారాయణులకు ప్రీతికరమైన శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెలలో చేసే పూజలు అత్యంత విశిష్టమైనవని హిందువుల నమ్మకం. శివకేశవులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. శ్రావణ సోమవారం, శ్రావణ మంగళవారం, శ్రావణ శుక్రవారం, శనివారం ఇలా ఈ నెలలో ప్రతి రోజూ విశిష్టత గలవే. అందుకనే ఈ నెలను ఆధ్యాత్మిక మాసమని అంటారు. శ్రావణమాసం మహిళలకు ఎంతో పవిత్రమైన మాసం. ఎందుకంటే మహిళలు చేసే వ్రతాలలో ఎక్కువగా ఈనెలలోనే ఉంటాయి.

నెలవారీ ముహూర్తాలు

జూలై: 26, 30, 31 తేదీలు.
ఆగస్టు: 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17.
సెప్టెంబరు: 24, 26, 27, 28.
అక్టోబరు: 1, 2, 3, 4, 8, 10, 11, 12, 22, 24, 29, 30, 31.
నవంబరు: 1, 2, 7, 8, 12, 13 15, 22, 23, 26, 27, 28, 30.

● డిసెంబరు 8 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 6వ తేది వరకు దాదాపు రెండు నెలలపాటు ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు.

పండుగలకు 'నెల'వు

శ్రావణ మాసంలో అనేక పండుగలు వస్తున్నాయి. ఈ నెల 25న తొలి శుక్రవారం, ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ, జంధ్యాల పౌర్ణమి వేడుకలు, 16న శ్రీకృష్ణాష్టమి వంటి ముఖ్యమైన పండుగలున్నాయి.22న ఐదో శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది. శ్రావణం పూర్తయిన వెంటనే బాద్రపద మాసంలో 27న వినాయక చవితి వస్తుంది.

పెళ్లిళ్ల సీజన్

మే నెలతో ముహూర్తాలు ముగియడంతో వివాహాలు, శుభ కార్యాలయాలకు విరామం వచ్చింది. ఇక, శ్రావణ మాసం మొదలుతో పెళ్లిళ్ల సీజన్ వచ్చేసినట్లే. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ కల్యాణ మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఇక, గృహ ప్రవేశాలు, గృహ నిర్మాణానికి భూమిపూజ, నామకరణం వంటి అనేక శుభకార్యాలూ జరగనున్నాయి.



మామిడితోట మారిందిలా..



ఛ్ఛీ.. మామిడి!

● లాభాల్లేక ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి

పురుగులు, నకిలీ మందులే కారణం

ఇప్పుడు మామిడి పంట అధిక దిగుబడి వచ్చినా అందులో పురుగులున్నాయి. పంటను నాశనం చేస్తున్నాయి. అనేక రకాల మందులు వాడినా ప్రయోజనం లేదు. దీనికి కారణం నకిలీ మందులే ఎక్కువగా ఉండటం. ఇక్కడ వాతావరణానికి అనుకూలంగా ఉండే.. నిర్వహణ తక్కువ ఉండే పంటలను వేయాలని మామిడి చెట్లను తొలగించాం.

- ధనంజయులునాయుడు, ఎం.కొంగరవారిపల్లె



చంద్రగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మామిడికి ఈ ఏడాది గిట్టుబాటు ధరల్లేక రైతులు నష్టపోయారు. రేటు మాట అటుంచితే.. ఫ్యాక్టరీలకు తోతాపురి కాయలు తోలేందుకూ ఇబ్బంది పడ్డారు. ట్రాక్టర్లలో కాయలు లోడ్ చేసి.. పల్ప్ ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి నిరీక్షిస్తూ, మరోవైపు కుళ్లిపోతున్న కాయలు చూసి ఆవేదన చెందారు.ఈ క్రమంలో పలువురు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతున్నారు.గతంలో అన్ని పంటలలో రారాజుగా మామిడి ఉండేది. కొన్నేళ్ల క్రితం మామిడి పంటల ద్వారా అధిక దిగుబడితో రైతులను ఆర్థిక పురోగతిని పెంచింది. ఇక, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మామిడి పంటను ప్రోత్సహించాయి. ఇలా జిల్లాలో మామిడి సాగు పెరిగింది. గత కొన్నేళ్లుగా మామిడిలో లాభాలు అంతగా రాలేదు. వచ్చే సంవత్సరమైనా లాభాలు రాకపోతాయా అంటూ .. ఎప్పటికప్పుడు ఎదురు చూస్తూ వచ్చారు. అయితే, ఈ ఏడాది తోతాపురి పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. దీంతో పంట విక్రయించలేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం గిట్టుబాటు ధర కూడా లేక చాలామంది అప్పుల పాలయ్యారు. ఈ క్రమంలో మామిడి పంటపై ఆశలు వదులుకున్నారు. ఎన్నో ఏళ్లుగా మామిడి చెట్లను కాపాడుకొంటూ వస్తున్న రైతుల్లో.. పలువురు ఇప్పుడు చెట్లను నరికేస్తున్నారు. చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లెకు చెందిన ధనంయజయ నాయుడికి ఏడు ఎకరాలు మామిడి చెట్లున్నాయి.పాశం గోపాల్‌నాయుడు మూడు ఎకరాలు, ముంగిలిపట్టుకు చెందిన మునిశేఖర్‌నాయుడు రెండున్నర ఎకరాలలో మామిడి సాగు చేశారు. మామిడిలో లాభాలు లేకపోవడంతో చెట్లను తొలగిస్తున్నారు. వీటి స్థానంలో కొబ్బరి చెట్లు, లేదా అంతర పంటలు, లేక పొట్టేలు.. కోళ్ల ఫారం, డెయిరీ ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.



నరికేసిన చెట్లను ట్రాక్టర్‌లో తరలిస్తూ..

టీటీడీ ఉద్యోగిపై వెంకటగిరి ఎమ్మెల్యే ఫైర్

● మహద్వారం గేటు తీసేందుకు నిరాకరించడంతో ఆగ్రహం

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ టీటీడీ ఉద్యోగిపై విరుచుకుపడ్డారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని మహద్వారం గుండా ఎమ్మెల్యే వెలుపలకు వచ్చారు. ఆయన వెనుక ఉన్న అనుచరులను అదే దారిలో బయటకు పంపేందుకు గేటు వద్ద విధుల్లోవున్న ఉద్యోగి నిరాకరించారు. తాను ఎమ్మెల్యేనని రామకృష్ణ చెప్పినప్పటికీ గేటు తీయలేదు. పుష్కరిణి వైపు ఉన్న మార్గం ద్వారా బయటకు వెళ్లాలని ఆ ఉద్యోగి సూచించారు. దీంతో ఎమ్మెల్యేకి, ఉద్యోగికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో ఆలయ అధికారులు జోక్యం చేసుకుని గేటు తెరిపించి వెలుపలకు పంపారు.



ఉద్యోగిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే

ఇలా.. జాతిపిత



● అనుమతిలేకనే గాంధీ విగ్రహం కూల్చివేత
● శ్మశానంలో పడేసిన ఛోటా నేతలు

గ్రామంలో 60 ఏళ్లపాటు ఠీవిగా ఉన్న జాతిపిత విగ్రహం.. గురువారం సాయంత్రం ఇలా శ్మశానం వద్ద పడుంది. అధికారుల అనుమతి లేకుండా కూలగొట్టి.. భవన వ్యర్థాల మధ్య పడేయడంపై గ్రామస్తులు ఆవేదన.. ఆగ్రహం వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట మండలం పుదూరులో ఆరు దశాబ్దాల నాటి గాంధీ విగ్రహం స్వల్పంగా శిథిలావస్థకు చేరింది. దీంతో కొత్త విగ్రహం ఏర్పాటుకు ఈ నెల 19న పంచాయతీలో తీర్మానించారు. అంతే.. గురువారం మధ్యాహ్నం కొందరు చోటా నాయకులు గాంధీ విగ్రహాన్ని పగలగొట్టి.. శ్మశానంలో భవన నిర్మాణ శిథిలాల వద్ద పడేశారు. సాయంత్రం కొందరు చూసేసరికి గాంధీ విగ్రహం స్థానంలో చదును చేసేసి ఉంది. విగ్రహం ఎక్కడ ఉందంటూ ఆరా తీయగా.. శ్మశానం వద్ద కనిపించింది. 'ఈ నెల 19న గాంధీ విగ్రహం కొత్తగా ఏర్పాటు చేసేందుకు మాత్రమే పంచాయతీ తీర్మానం చేసింది. విగ్రహం పడగొట్టడం కోసం మా అనుమతులు తీసుకోలేదు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలిపాం' అని పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు తెలిపారు.

- నాయుడుపేట టౌన్

ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీలో శ్రీసిటీకి ప్రాధాన్యం

● తిరుపతిలో మరో ఫైవ్ స్టార్
● 'గ్రీన్‌ల్యామ్' విస్తరణకు ప్రోత్సాహకాలు
● మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీలో శ్రీసిటీకి ప్రాధాన్యం లభించనుంది. అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో జిల్లాకు సంబంధించి ఉన్నాయి. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ వస్తువుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఏపీ ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0 (2025-30)ని మంత్రివర్గం ఆమోదించింది. ఈ పాలసీలో భాగంగా దేశంలోనూ, ప్రపంచ స్థాయిలోనూ పెద్ద ఎత్తున పెట్టుబడులను, ఎలక్ట్రానిక్స్ భాగాల పర్యావరణ వ్యవస్థను ఉత్తేజితం చేయనుంది. దీనివల్ల శ్రీసిటీలో పెట్టుబడి పెట్టే ఎలక్ట్రానిక్ భాగాల తయారీ కంపెనీలు ముందస్తు ప్రోత్సాహకాలు, మ్యాచింగ్ ప్రోత్సాహకాలు, మధ్యంతర మద్దతు వంటివి ప్రభుత్వం నుంచీ పొందనున్నాయి. వీటన్నింటి వల్ల శ్రీసిటీలో ఎలక్ట్రానిక్స్ విడి భాగాల తయారీ పరిశ్రమలు మరిన్ని ఏర్పాటై ఉద్యోగాల కల్పనకు గణనీయంగా అవకాశాలు ఏర్పడనున్నాయి.

● నాయుడుపేట పారిశ్రామికవాడలో ఇప్పటికే రూ.1150 కోట్ల పెట్టుబడితో 1800 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన మెస్సర్స్ గ్రీన్ ల్యామ్ లిమిటెడ్ సంస్థ పరిశ్రమను విస్తరించే ప్రయత్నాల్లో వుంది. దీనికి కూడా ఈనెల 17న జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో చేసిన సిఫారసులను మంత్రివర్గం ఆమోదించింది.

● ఇప్పటికే తిరుపతి, పరిసరాల్లో అనేక ఫైవ్ స్టార్ హోటళ్లు ఏర్పాటవుతున్న నేపథ్యంలో తాజాగా మరో సంస్థకు మంత్రివర్గం అనుమతిచ్చింది. బెంగళూరుకు చెందిన మెస్సర్స్ స్టార్టర్న్ ఎల్ఎల్‌పీ సంస్థ తిరుపతిలో ఫైవ్ స్టార్ హోటల్ ఏర్పాటుకు ముందుకురాగా భూమి, రాయితీలు ఇచ్చేందుకు మంత్రివర్గం అంగీకరించింది.

భార్యపై అనుమానంతో

ఫీల్డ్ అసిస్టెంట్ ఇంటికి నిప్పు

రేణిగుంట జూలై 24 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేయాలని భావించాడు. బంధువులతో కలిసి గురువారం తెల్లవారుజామున దొడ్లమిట్టలోని అతడి ఇంటికి నిప్పు పెట్టారు. ఇంట్లో ఉన్న నవీన్ అప్రమత్తం కావడంతో బయటపడ్డారు. సీఐ జయచంద్ర తెలిపిన ప్రకారం.. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్టలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద స్థానికంగా 200 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరిలో ఒక మహిళతో నవీన్‌కు వివాహేతర సంబంధం ఉందని ఆమె భర్తకు అనుమానం. దీంతో అతడు నవీన్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 2 గంటలకు తన అన్న, అక్కతో కలిసి ఆ మహిళ భర్త రామాంజనేయులు.. నవీన్‌ను సజీవంగా దహనం చేసేందుకు అతడి ఇంటి చుట్టూ పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇంటికి మంటలు అంటుకోవడంతో నిద్రలో ఉన్న నవీన్ తేరుకొని బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఏసీ, ఇంట్లోని ముఖ్యమైన పరికరాలు కాలిపోగా, 70 శాతం ఇల్లు దగ్ధమైందని సీఐ తెలిపారు. బాధితుడు నవీన్ ఫిర్యాదు మేరకు రామాంజనేయులు, ఆదినారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



దొడ్లమిట్టలో ఇంటికి నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఇల్లు

టీటీడీ అన్నప్రసాద ట్రస్టుకు రూ.2 కోట్ల విరాళం



తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం రూ.2 కోట్లు విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు ఈ చెక్కులను ఆలయంలోని రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24(ఆంధ్రజ్యోతి): 'పేదరిక నిర్మూలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కండి. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోండి' అంటూ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్ వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో వర్చువల్ విధానంలో మాట్లాడారు. శ్రీకాళహస్తి, సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని పరిశ్రమల ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లోని కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు.

చాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం



చాముండేశ్వరిదేవి సేవలో భానుప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పుదిపట్లలోని చాముండేశ్వరిదేవి ఆలయ వారికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకాలంకరణ చేసి, భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. లక్ష కుంకుమార్చన, దీపారాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. టీటీడీ పాలకమండలిసభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బిరుదాల భాస్కర్‌రెడ్డి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. వీరికి అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనం అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వాసు, మల్లికార్జున, శేఖర్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



అనుపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోందని మాజీ ఎంపీపీ బింధుమాదవి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం అనుపల్లి పంచాయతీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఐదేళ్లు ఎలాంటి అభివృద్ధీ జరగలేదని, నాని ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దాదాపు రూ.10కోట్లతో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల ఏర్పాటు తదితర పనులు చేపట్టారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు సోము రాయల్, నాయకులు విజయకుమార్, దేవరాజులు, మధుసూదన్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు రమణారెడ్డి, మహేష్‌రాయల్, జవహర్, కుమార్, జగదీష్, లోకేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయబారం



హరికథ చెబుతున్న భాగవతారణి అనసూయ

రామచంద్రాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం భాగవతారిణి అనసూయ ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయభారం సభికులను ఆకట్టుకుంది. అరణ్య, అజ్ఞాతవాసాలు ముగించుకుని పాండవులు దుర్యోధనుడి వద్దకు తమకు ఇవ్వాల్సిన రాజ్యంకోసం శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపారు. అక్కడ శ్రీకృష్ణుడు, దుర్యోధనుడి సంభాషణలను భాగవతారిణి రక్తి కట్టించారు. అంతకుముందు ఆలయంలో ద్రౌపదీ సమేత మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్ రెడ్డి

భాకరాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు స్త్రీశక్తి భవన్‌లో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వివరించారు. తహసీల్దారు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పలు గ్రామాల్లో దారి, సరిహద్దు సమస్యలపై అర్జీలు వస్తున్నాయని, వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తున్నామని అన్నారు. ముటేషన్లు జేసీ లాగిన్‌కు వెళ్లడం వల్ల ఆలస్యం అవుతున్నాయన్నారు. చనిపోయిన వారి పేరుతో ఉన్న పాసు పుస్తకాలను కుటుంబ సభ్యుల పేరుతో మార్చుకోవాలన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో రూ.4.45 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని ఏఈ సూర్యప్రకాశ్ తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా తాగునీటి ట్యాంకులు ప్రతి 15 రోజులకు శుభ్రం చేసుకోవాలని వైద్యాధికారి తెలిపారు. పెరటి కోళ్ల పెంపకం, చిన్న చిన్న కిరాణా షాపుల కోసం రుణాలు అందజేస్తామని వెలుగు ఏపీఎం స్వర్ణలత చెప్పారు. ప్రజలు సోలార్ కరెంట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. పెయ్య దూడల పథకం కింద రూ.150కే సెమెన్ అందిస్తామని పశువైద్యాధికారి స్రవంతి తెలిపారు. రీ-సర్వేలో ముగ్గురు లేక నలుగురు రైతులు కలిపి ఒక ఎల్‌పీఎం నంబరు ఇస్తున్నారని, దీంతో వన్ బీలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భాకరాపేట సర్పంచ్ భూపాల్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునీత దామోదర్ రెడ్డి, ఎంపీడీవో గిడ్డయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తంశెట్టి ప్రభాకర్ పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



భాకరాపేటలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చిట్టెమ్మ

భాకరాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఏడాది కాలంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని తెలుగు మహిళ మండలాధ్యక్షురాలు చిట్టెమ్మ కోరారు. భాకరాపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, తల్లికి వందనం ఇచ్చి పిల్లల చదువుకు తోడ్పడుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, లోకనాథం, శ్రీధర్ పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స

తిరుపతి(వైద్యం), జూలై 24(ఆంధ్రజ్యోతి): సగానికి పైగా తెగిపోయిన చేతి భాగాన్ని అతిక్లిష్టమైన ప్లాస్టిక్ శస్త్ర చికిత్సతో తిరిగి యథావిధిగా అతికించిన ఘనత మెడిగో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికే దక్కుతుందని ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. స్థానిక మెడిగో ఆస్పత్రిలో ఆయన గురువారం మీడియా సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రైవేటు కంపెనీలో కూలి పనులు చేసుకునే వ్యక్తి చేయి ప్రమాదవశాత్తు 85 శాతం వరకు తెగిపోగా మెడిగో ఆస్పత్రి వైద్య బృందం అతిక్లిష్టమైన మైక్రోసర్జరీ పద్ధతుల ద్వారా శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

నీతికీ కోరికకూ మధ్య నలిగిన వ్యక్తిత్వం..!

మనిషి నైతిక పతనాన్ని ప్రదర్శించిన యయాతి నాటకం







యయాతి నాటకంలోని దృశ్యం - స్వప్నం రాల్చిన అమృతం నాటకంలోని దృశ్యం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): నీతికీ, కోరికకూ మధ్య నలిగిన వ్యక్తిత్వాన్ని యయాతి నాటకం అత్యద్భుతంగా ప్రదర్శించింది. అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో 25వ జాతీయ నాటకోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆరో రోజైన గురువారం మధిరకు చెందిన శ్రీసుమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'యయాతి' పద్య నాటకం ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శారద ప్రసన్న రాశారు. డాక్టర్ ఎస్ఎస్ఆర్ దర్శకులుగా వ్యవహరించారు. సహజమైన జీవన విధానమే మనిషి జన్మకు పరిపూర్ణతను ఇస్తుందనే సందేశాన్ని ఈ నాటకం ఇచ్చింది. కృత్రిమ జీవన విధానం వైపు అడుగులు వేస్తే మనిషి నైతికంగా పతనం కాక తప్పదనే హెచ్చరికను ఈ నాటం దృశ్యమానం చేసింది. అలాగే కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి ఆధ్వర్యంలో స్వప్నం రాల్చిన అమృతం సాంఘిక నాటిక ప్రదర్శించారు. మరమాత్ముని శివరాం రాయగా, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. ఒక కాకికి గాయం తగిలి కింద పడిపోతే, అన్ని కాకులు చుట్టూ చేరి కావు కావుమని అరుస్తాయి. ఏ బంధాలూ అనుబంధాలు లేకపోయినా కాకులు ఐకమత్యాన్ని చాటుకుంటాయి. భార్యాభర్తల బంధానికి విలువనిచ్చే మనుషులు కనీస జ్ఞానాన్నీ నీతిని పాటించకపోవడాన్ని ఈ నాటకం పట్టి చూపింది. ఈ నాటకంలో కొత్తకొండ సత్యనారాయణ, గుడివాడ లహరి, జ్యోతి, రమేష్ పాత్రలు ధరించారు. సురభి నాగరాజు, కేదారి నాగు సాంకేతిక సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి రఘునాథ్, మున్సిపల్ మాజీ కమిషనర్ మోహన్ రెడ్డి, అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్ రెడ్డి, కళాభిమానులు పాల్గొని వీక్షించారు.

ఆకట్టుకున్న చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు

జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలు ఆద్యంతమూ ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలువురు సంకీర్తనాచార్యుల కీర్తనలకు అనుగుణంగా చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అందరినీ అలరించారు.

కార్యక్రమంలో నేడు

శుక్రవారం ఉదయం 9:30 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీసాయిబాబా నాట్య మండలి వారి ఖడ్గ తిక్కన పద్య నాటక ప్రదర్శన ప్రారంభం కానుంది. సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాదుకు చెందిన గోవాడ క్రియేషన్స్ ఆధ్వర్యంలో భీశెట్టి జ్యోతిరాజ్ రూపొందించిన 'అమ్మ చెక్కిన బొమ్మ' సాంఘిక నాటిక ప్రదర్శన నిర్వహిస్తారు.







చెత్త నిర్వహణపై ఐటీసీతో కార్పొరేషన్ ఒప్పందం



తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన తిరుపతి సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరంలోని ప్రతి ఇంటి వద్ద చెత్త వేరు చేసి ఇవ్వడంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఐటీసీ తరఫున అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ (ఏ.జీ.ఎస్.) స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గురువారం కమిషనర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేర్వేరుగా చేసి ఇస్తే కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఐటీసీ సహకారంతో అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. వ్యర్థాలను విభజన చేసేలా ప్రజలను ప్రోత్సహించి, ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన తిరుపతిని సాధించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమన్నారు. రీసైక్లింగ్ చేయడం, హోమ్ కంపోస్ట్ చేయడంపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఐటీసీ కంపెనీ వారి సీఎస్ఆర్ పాజెక్ట్ కింద ఈ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. నగర ప్రజలు ఏజీఎస్ ప్రతినిధులకు సహకరించాలని కోరారు. అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణమూర్తితో కమిషనర్ ఎన్.మౌర్య ఒప్పందం కుదుర్చుకున్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఏజీఎస్ ప్రాంతీయ సమన్వయకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.





శివలింగం దర్శనానికి ఎగబడుతున్న భక్తులు

శివుడు కళ్లు తెరిచాడంటూ...!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): శివుడు కళ్లు తెరిచాడంటూ గురువారం రాత్రి తిరుపతి డీఆర్ మహల్ సమీపంలోని రామేశ్వర మునిరాత్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు భక్తులు తరలి వచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు శివలింగాన్ని దర్శించుకున్నారు.



విద్యార్థి నాయకులతో ఎస్ఐ సుబ్బరాజు, హెచ్ఎం లక్ష్మీప్రసన్న

చైతన్య స్కూల్‌లో విద్యార్థి క్యాబినెట్ ఎన్నిక

తిరుపతిరూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ తారకరామనగర్‌లోని శ్రీచైతన్యస్కూల్‌లో గురువారం విద్యార్థి క్యాబినెట్ ఎన్నిక నిర్వహించారు. విద్యార్థి నాయకులు(ఎస్పీఎల్, ఏఎస్పీఎల్ తదితర)గా ఎన్నికైన వారికి ముఖ్య అతిథిగా హాజరైన ఈస్ట్ ఎస్ఐ సుబ్బరాజుతో ఏజీఎం జి.సురేష్ కలసి బ్యాడ్జ్‌సను అందజేశారు. సుబ్బరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని, మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కొత్తగా కొలువుదీరిన విద్యార్థి క్యాబినెట్‌ను వారితోపాటు టీచర్లు అభినందించారు. హెచ్ఎం పి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

టీచర్లకు హ్యాండ్‌బుక్స్ పంపిణీ



హ్యాండ్‌బుక్స్‌ని పంపిణీ చేస్తున్న ఎంఈవోలు మహమ్మద్‌రఫీ, శంకరయ్య

తిరుపతిరూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఎంఈవో కార్యాలయంలో గురువారం ఎంఈవో-1 మహమ్మద్ రఫీ, ఎంఈవో-2 శంకరయ్య నేతృత్వంలో మండలంలోని టీచర్లకు హ్యాండ్‌బుక్స్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యాప్రమాణాల పెంపునకు హ్యాండ్‌బుక్స్ ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. అందులో పొందుపరిచిన అంశాలను ఆచరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఫుడ్ టెక్నాలజీతో ఆహారోత్పత్తి పరిశ్రమల అనుసంధానం



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ టెక్నాలజీతో ఆహార ఉత్పత్తి పరిశ్రమలను అనుసంధానం చేయనున్నట్లు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు పేర్కొన్నారు. అప్లికేషన్ ఆఫ్ టెక్చర్ అనాలసిస్ ఇన్ ఫుడ్ సైన్స్ అంశంపై ఎస్వీయూ హోంసైన్స్, ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ను గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆహార ఉత్పత్తుల పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హోం సైన్స్, ఫుడ్ టెక్నాలజీ చదువుకున్న వారికి మంచి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో హోం సైన్స్ విభాగం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, హోం సైన్స్ విభాగాధిపతి మంజుల, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ సుచరిత, ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర మంత్రి



ఆలయం వద్ద మంత్రి పంకజ్ ముండే

తిరుచానూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని గురువారం మహారాష్ట్ర మంత్రి పంకజ్ ముండే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



ఎర్రావారిపాలెం, జూలై 24(ఆంధ్రజ్యోతి) : తలకోన ఆలయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు కేటాయించేందుకు అనుమతి ఇవ్వడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు తలకోన ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో తలకోన సిద్ధేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం, అభివృద్ధి చేసేందుకు టీటీడీ అంగీకారం తెలిపాయని పేర్కొన్నారు. తక్షణం రూ.2 కోట్లు విడుదల చేయించారన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, కార్యదర్శి మహేష్ నాయుడు, ఉపాధ్యక్షుడు హరిశ్చంద్ర, తలకోన బోర్డు చైర్మన్ సోమనాథరెడ్డి, తెలుగు మహిళాధ్యక్షురాలు కొమ్మక లక్ష్మీదేవి, సింగిల్ విండో అధ్యక్షుడు శిరివేలు రఘు, కేశవులు నాయుడు, మురళి, యూత్ అధ్యక్షుడు నిరంజన్ రాయల్, చిట్టిబాబునాయుడు, సిద్దారెడ్డి, నాగరాజ, మీడియా కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి, గుర్రప్ప నాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబర్ నుంచి ప్రాణ రక్షణ కల్పించండి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ పేరూరుకు చెందిన యూట్యూబర్ కల్లూరు హేమాద్రి నుంచి తమకు ప్రాణహాని ఉందని, అధికారులు తమకు రక్షణ కల్పించాలని ఓ బాలిక తల్లి కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అతడు తన బిడ్డ జీవితాన్ని నాశనం చేశాడన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు పోక్సో కేసు కూడా పెట్టారన్నారు. నాపై కేసు పెట్టినంత మాత్రానా ఏం చేయలేవని అతడు బెదిరిస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. నిన్ను చంపితే ఎవరు అడ్డొస్తారో చూస్తానని బెదిరిస్తున్నాడన్నారు. అతడి నుంచి తమకు ప్రాణరక్షణ కల్పించాలని వేడుకున్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యుడిగా శ్రీనివాసులు



భాకరాపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటకు చెందిన బీజేపీ నాయకుడు దాసరి శ్రీనివాసులును జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, కూటమి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా చూస్తానన్నారు.

గరుడ వారధిపై డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి



తిరుపతి (నేరవిభాగం), జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం లక్ష్మీపురం సర్కిల్ వద్ద గరుడ వారధిపై డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు గురువారం రాత్రి మృతిచెందారు. ఇతడు లారీ క్లీనర్ నరేష్ అని స్థానికులు చెబుతున్నారు. నాయుడుపేట ప్రాంతానికి చెందిన ఇతడు, లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. మామిడికాయల మండీ వైపు నుంచి గరుడ వారధిపై ద్విచక్ర వాహనంలో వేగంగా వస్తుండగా, అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు భావిస్తున్నారు.

మోడల్ సిటీగా తిరుపతి

● కమిషనర్‌ను సత్కరించిన డిప్యూటీ మేయర్లు, అధికారులు



కమిషనర్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు

తిరుపతి, జూలై24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి కార్పొరేషన్ మీద ప్రత్యేక దృష్టి సారించి నగరాన్ని మోడల్ సిటీగా మార్చేందుకు కమిషనర్ ఎన్.మౌర్య కృషి చేస్తున్నారని డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా మౌర్య బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పలువురు ఆమెను అభినందనలతో ముంచెత్తారు. తిరుపతి కార్పొరేషన్‌కు స్వచ్ఛత అవార్డు రావడం వెనుక ఆమె కృషిని డిప్యూటీ మేయర్లు కొనియాడారు. శాలువతో సత్కరించి, శ్రీవారి చిత్రపటం, తాతయ్యగుంట గంగమ్మ తీర్థప్రసాదాలు అందించిన వారిలో కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహ, నరేంద్ర ఉన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసారత్నం సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రతి అధికారిపైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు పద్మావతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బాలల హక్కుల అమలుపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ 12రకాల కమిటీలు ఏర్పాటు చేసి, మానవ, బాలల హక్కులపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వారి హక్కులను కాపాడే బాధ్యత అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈవో కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, గౌరీశంకర్‌రావు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు ఘన స్వాగతం



ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 24(ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి స్థానిక బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆయన గురువారం సాయంత్రం తిరుపతికి వచ్చారు. స్థానిక పద్మావతి అతిథి గృహం వద్ద బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ తదితరులు స్వాగతం పలికి, సత్కరించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, నాదముని, మైనార్టీ మోర్చా నాయకులు మస్తాన్ తదితరులు గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

గణితంపై పట్టుకు అబాకస్ ఉపయుక్తం



అబాకస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

తిరుపతి(విద్య), జూలై 24(ఆంధ్రజ్యోతి): గణితంపై పట్టు సాధించేందుకు అబాకస్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. తిరుపతికి చెందిన ఆర్కే అబాకస్ చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి విమల రూపొందించిన ఆర్కే అబాకస్ - వేదిక్ మాథ్స్ 2.0 వర్షన్ పుస్తకాలను విజయవాడలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితంపట్ల భయాన్ని పోగొట్టి సులభంగా నేర్పించేందుకు తిరుపతి ఆర్కే అబాకస్ చైర్మన్, డైరెక్టర్లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

ఎంబీఏ పరీక్ష కేంద్రంలో రిజిస్ట్రార్ తనిఖీలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ప్రకాశం భవన్‌లో చేపట్టిన ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 19నుంచి పరీక్షలు ప్రారంభమై ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో పరీక్షా కేంద్రంలో రిజిస్ట్రార్ తనిఖీ చేపట్టారు. పరీక్షల నిర్వహణ తీరును ప్రిన్సిపాల్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తుండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి సమస్యలూ రాకుండా చూడాలని సూచించారు.

సుగుణలతకు పీహెచ్‌డీ ప్రదానం



సుగుణలత

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆంగ్ల విభాగంలో పరిశోధన చేసిన జి.సుగుణలతకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు వర్సిటీ సీవోఈ డాక్టర్ బి.రాజమాణిక్యం పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ పి.ఉషారాణి మార్గదర్శకంలో మల్టీకల్చరలిజమ్ ఇన్ ది నోవెల్స్ ఆఫ్ విక్రమ్‌సేత్ అనే అంశంపై పరిశోధనా వ్యాసం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశామని వివరించారు. కాగా ఈమె టీపీపీఎం హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ రావడం పట్ల పలువురు అభినందించారు.

హస్తకళలు సంస్కృతికి ప్రతీకలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24(ఆంధ్రజ్యోతి): హస్తకళలు సంస్కృతికి ప్రతీకలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి అన్నారు. హస్త కళాకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. శ్రీవారి దారు శిల్పాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు ఉమేష్‌రావు, హరి, కొయ్యబొమ్మల కళాకారుడు జయముని ఆచారి పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల అధ్యాపకుడికి మెరిటోరియస్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల అధ్యాపకుడు రమణమూర్తి మెరిటోరియస్ టీచర్ అవార్డు పొందారు. విజయవాడలో చేపట్టిన వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గురువారం ఆయన ఈ అవార్డును స్వీకరించారు. స్టాటిస్టిక్స్ బోధనలో విశేష కృషికి గుర్తింపుగా అవార్డును అందుకున్నారు. వర్సిటీ అధికారులు, సహ అధ్యాపకులు అభినందించారు.

ఎటుచూసినా చెత్త కుప్పలే

● తిరుపతి నగరంలో మచ్చుకైనా కానరాని పారిశుధ్యం







చింతలచేను మొదట్లో చెత్త కుప్ప - వైష్ణవి ఆస్పత్రి మలుపు వద్ద ముళ్లకంప, వ్యర్థాల కుప్ప - ఫస్ట్ రైల్వేగేటు సమీపంలో డ్రైనేజీ మట్టి నిల్వలు

తిరుపతి అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఎటుచూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. గురువారం ఆంధ్రజ్యోతి కంటపడిన దృశ్యాలు నగరంలో పారిశుధ్య లోపాన్ని స్పష్టం చేస్తున్నాయి. చింతలచేను గ్రామం మొదట్లో, చివర్లో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. నాలుగురోజులుగా సిబ్బంది ఇటువైపు తొంగిచూడలేదని స్థానికులు చెబుతు న్నారు. ఫస్ట్ రైల్వేగేటుకు సమీపంలో మురుగు కాలువల నుంచి పూడిక తీసి దాన్ని రోడ్డుపైనే గుట్టలుగా పేర్చిపెట్టారు. తుడా కార్యాలయం మార్గం, వైష్ణవి ఆస్పత్రికి, ప్రైవేటు పాఠశాలకు వెళ్లే మలుపు వద్ద కొన్ని రోజులుగా ముళ్లకంప, వ్యర్థాలు కుప్ప నిల్వ ఉంటోంది.దీంతో ఆస్పత్రికి వెళ్లే రోగులు, బడి పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఇక తిరుమల బైపాస్ రోడ్డు నుంచి వకుళమాత ఆలయం, సప్తగిరినగర్‌కు వెళ్లే మార్గంలోనూ చెత్త నిల్వలు పేరుకున్నాయి. వీధి శునకాలు వాటిని చెల్లాచెదురు చేస్తుండడంతో రోడ్డంతా అపరి శుభ్రంగా తయారైంది. ఇలాంటి దృశ్యాలు చూసిన స్థానికులు, వాహనదారులు చీదరించుకుంటున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.



వకుళమాత ఆలయం, సప్తగిరినగర్‌కు వెళ్లే మార్గంలో..

చెరువుల్లోకి మళ్లీ డ్రైనేజీ నీరు



కాలువ తీసి డ్రైనేజీ నీటిని మళ్లించిన దృశ్యం

తిరుపతి అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగర డ్రైనేజీని మళ్లీ శెట్టిపల్లి చెరువులోకి మళ్లించేశారు. చేపలను పెంచేందుకు వీలుగా అన్నా, శెట్టిపల్లి చెరువులు అడుగంటకుండా గత వైసీపీ హయాంలో అండర్ డ్రైనేజీ నీటిని మళ్లించారు. ఈ రహస్యం గతేడాది ఆంధ్రజ్యోతిలో వెలుగులోకి తీసుకురావడంతో సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఆ నీటిని చెరువుల వైపు కాకుండా తూకివాకం వద్దవున్న మురుగుశుద్ధి కేంద్రానికి తరలించారు. అయితే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం, వర్షపాతం సాధారణం కంటే తక్కువ నమోదు కావడంతో చెరువుల్లో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. ఇలానే కొనసాగితే పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదముందని దాంతో చేపల పెంపకానికి గడ్డు పరిస్థితులు నెలకొనవచ్చని భావించి చెరువుల టెండర్లు దక్కించుకున్న వారు మళ్లీ డ్రైనేజీని యథావిధిగా మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వర్షాలు కురవడంతో డ్రైనేజీతో పాటు వర్షపునీరు ఉధృతంగా ఈ చెరువుల్లోకి చేరుతోంది.





చెరువులోకి వెళుతున్న డ్రైనేజీ నీరు

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలవుతున్నా వడ్డెరలకు చట్టసభల్లో అవకాశం దక్కలేదన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో విజయాన్ని శాసించే స్థాయిలో వడ్డెర ఓటర్లు ఉన్నా అన్ని పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని తెలిపారు. అందుకే హక్కుల కోసం త్వరలోనే అమరావతిలో వడ్డెర మహాసభ నిర్వహిస్తామన్నారు. వడ్డెర సంఘం నేతలు శ్రీనివాసులు, మదన్‌మోహన్, నాగరాజు, బాల, శ్రీనివాసులు, జగన్నాథ్ పాల్గొన్నారు.

మూడు డివిజన్లలో టీడీపీ తొలి అడుగు



కరపత్రాలు అందజేస్తున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి, జూలై24(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జోరు పెంచారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో గురువారం 13, 14, 15 డివిజన్లలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఏడాదిలో అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. రాబోయే రెండేళ్లలో తిరుపతి అభివృద్ధి పథంలో మరింతగా దూసుకుపోనుందన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ వర్మ, యూనిట్ ఇన్‌చార్జి శ్రీహరి నాయుడు, నాయకులు పాటకం వెంకటేష్, సుబ్రమణ్యం, రవి, సుబ్బయ్య, వాళముని, పత్తిపాటి భారతి, మంగ మ్మ, రేణుక, మాలతి, యశోద, జస్వంత్, లక్ష్మి, ఉదయ్‌సాయి, రాము పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీప్రియులు

తిరుపతి(ఆటోనగర్), జూలై 24(ఆంధ్రజ్యోతి) : మహాకవి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా గురువారం సాహితీ ప్రియులు ఘనంగా నివాళుల ర్పించారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ జాషువా రచనలు దళిత సామాజిక చైతన్యానికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. ఆయన కవిగాను, సామాజిక విప్లవ జ్యోతిగానూ సమానత్వం కోసం తనదైన శైలిలో పోరాటం చేశారని తెలిపారు. అనంతరం ఒ.వెంకటరమణ, ఆకుల మల్లేశ్వర రావు, డాక్టర్ రవీంద్ర, మల్లారపు నాగార్జున జాషువ సేవలను కీర్తించారు. నివాళులర్పించిన వారిలో రఫీ, లత, ముకేష్, సంధ్య, సుబ్రమణ్యం ఉన్నారు.

జాషువా సాహిత్యంలో సామాజిక మార్పు కాంక్ష



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరసారత్నం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుర్రం జాషువా తన సాహిత్యంలో సామాజిక మార్పు ఆకాంక్షించారని మాజీ మంత్రి పరసారత్నం పేర్కొన్నారు. తిరుపతి అంబేడ్కర్ భవన్‌లో కవి గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పరసారత్నం మాట్లాడుతూ కుల, వర్గ నిర్మూలన లక్ష్యంగా జాషువా తన సాహిత్యం ద్వారా కృషి చేశారని అభిప్రాయపడ్డారు. జాషువా కృషికి గుర్తింపుగా పద్మవిభూషణ్ పురస్కారాన్ని పొందారని అన్నారు. ఆయన సాహిత్యాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్ మాట్లాడుతూ తిరుపతిలో జాషువా విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జడ్పీ సీఈవో వెంకటనారాయణ, కవులు ధర్మయ్య, గోవిందయ్య, కళాకారుడు శాంబోలు హరి, దళిత సంఘాల నేతలు నాగేశ్వరరావు, కృష్ణ, ప్రసాదరావు, అంజయ్య పాల్గొన్నారు.

తిరుపతి-సాయినగర్ (షిరిడీ) మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, సాయినగర్ (షిరిడీ) మధ్య ఆగస్టు 3 నుంచి 29వ తేదీ వరకు ప్రతి ఆది, సోమవారాల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07637) ఆగస్టు 3వ తేదీ ఆదివారం ఉదయం 4 గంటలకు బయలుదేరి రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లె, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ, సికింద్రాబాదు, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భల్కీ, ఉద్గిర్, లాతూర్ రోడ్డు, పర్లీ, గంగ్‌ఖేర్, పర్భానీ, సేలు, జాల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోప్రగామ్‌ల మీదుగా సాయినగర్‌కు సోమవారం ఉదయం 10.30 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

● సాయినగర్‌లో ఈ ప్రత్యేక రైలు(07638) అదే రోజు(సోమవారం) రాత్రి 7.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ బుధవారం వేకువజామున 1.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. తిరుపతి, షిరిడీలలో ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ఏర్పాటు చేశామని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రైళ్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.



ఆగమోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. ఆలయంలోని చెంగల్వరాయ సన్నిధి వద్ద స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు వసంతోత్సవం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయంలోని వసంత మండపం వద్ద ఈ వేడుకను నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లు కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. శుక్రవారం రాత్రి పల్లకీసేవ జరగనుంది.

ధ్వజావరోహణం పూజలు చేస్తున్న వేదపండితులు

బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న మహారథం

తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. శ్రీవారి మహారథం(చెక్కతేరు)ను సిద్ధం చేసే పనులు సాగుతున్నాయి. మరోవైపు ఆలయ మహద్వారం గేట్లను వివిధ రసాయనాలతో శుద్ధి చేస్తున్నారు. ఇక పుష్కరిణి మరమ్మతు పనులు కూడా వేగంగా సాగుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెక్క తేరును సిద్ధం చేస్తున్న సిబ్బంది




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని రెండు షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.55 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,130

తలనీలాలు సమర్పించినవారు: 26,786



కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

పట్టాలెక్కుతున్న మాస్టర్ ప్లాన్

ఏడాదిలో ఏం చేశారు?

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ఆధ్యాత్మిక క్షేత్రమే కాదు, రాజకీయంగానూ ప్రాధాన్యంగల నియోజకవర్గం శ్రీకాళహస్తి. తాతలు వేసిన బాట.. తండ్రి చూపిన తోవ.. తల్లి చేదోడుతో రాజకీయాల్లో అడుగులు వేస్తున్నారు బొజ్జల సుధీర్‌రెడ్డి. శ్రీకాళహస్తి అభివృద్ధికి అనేక పనులను భుజాలకెత్తుకున్నారు. స్థానికంగానే నివాసముంటూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. అధికారుల సమక్షంలో ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశిస్తున్నారు. మండలాల వారీగా టోల్‌ఫ్రీ తరహాలో ఫోన్ నంబర్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేగా దూకుడు ఎక్కువ అనే ముద్రను తొలి ఏడాదిలోనే తుడుపుకోగలిగారు. తొలి ఏడాది శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఆయన చేసినవీ, చేస్తున్నవీ, చేయాలనుకుంటున్నవీ.. ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు..





ఈట్ స్ట్రీట్ తరహాలో జరుగుతున్న స్వర్ణముఖి నది కరకట్ట పనులు

రూ. 35 కోట్లతో చేసిన పనులు

- తాగునీటి సమస్య వున్న గ్రామాల్లో 70 బోర్లు తవ్వించారు.



ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిమ్

- శాప్ నిధులతో ఇండోర్ స్టేడియం పునరుద్ధరణ. అందులో జిమ్, షటిల్ కోర్టు ఏర్పాటు.



శ్రీకాళహస్తి ఈద్గాలో పనులు

- శ్రీకాళహస్తిలో ఈద్గా పునరుద్ధరణ. పెద్ద ఈద్గాలో ల్యాంకో సీఎస్ఆర్ నిధులతో మినార్ నిర్మాణం.
- ఉపాధి హామీ కింద రూ. 12.64 కోట్లతో పనులు
- ఆర్ అండ్ బీ ద్వారా రూ. 1.71 కోట్లతో పనులు
- ఇరిగేషన్ శాఖ ద్వారా రూ. 3.82 కోట్లతో పనులు
- శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో రూ. 3.37 కోట్లతో పనులు.
- ఎంపీపీ 15వ ఆర్థిక సంఘం పీఎఫ్ఎంఎస్, సీఎఫ్ఎంఎస్ నిధులతో 10.82 కోట్లతో వివిధ పనులు.

పక్కా ఇళ్లకు స్పెషల్ డ్రైవ్: యువగళం పాదయాత్రలో పక్కా ఇళ్లకు, ఇళ్ల స్థలాలకు 59 వేల అర్జీలు వచ్చాయి. అర్హులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. ఇప్పటి వరకూ 15 వేల మందిని గుర్తించాం. డీకేటీ భూములు సేకరించి అందరికీ స్థలాలిస్తాం.

పారిశ్రామిక వరం: మన్నవరంలోని ఎన్టీపీసీ-భెల్ పరిశ్రమకు 50 ఎకరాలు మాత్రమే వుంచి మిగిలిన 700 ఎకరాలు వెనక్కు తీసుకున్నాం. ఇక్కడ హెలికాప్టర్ విడి భాగాల తయారీ పరిశ్రమ వచ్చే అవకాశముంది. రిలయన్స్, కార్డ్ బోర్డ్, ఫినోలెక్స్ వంటి మరో ఎనిమిది పరిశ్రమలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. గడ్డి పెంచడానికి, వెదురు ప్లాంటేషన్ కోసం గ్రీన్ కంపెనీ ఏర్పాటుకు యత్నిస్తున్నాం. దీనికి 30 వేల ఎకరాలు కావాలి.

ఇచ్చిన హామీలు

ప్రోగ్రెస్ రిపోర్ట్

- నియోజకవర్గంలో 40 నుంచి 50 వేల మందికి పక్కా ఇళ్ళు
- తండ్రి ప్రారంభించిన ముక్కంటి ఆలయ మాస్టర్ ప్లాన్ పూర్తి చేయడం
- గుడిమల్లం, తొండమనాడు, శ్రీకాళహస్తి ఆలయాలు కలుపుతూ టెంపుల్ టూరిజం సర్క్యూట్.
- ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉచితంగా ప్రత్యేక దర్శనం
- స్కిట్ కళాశాల పునఃప్రారంభం
- స్వర్ణముఖి ప్రక్షాళన
- మెడికల్ కళాశాల ఏర్పాటు
- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు
- మండలానికో ఎంఎస్ఎంఈ పార్కు... మహిళలకు ఉపాధి
- ఎస్ఎస్ కెనాల్, బాలాజీ రిజర్వాయర్ పూర్తి
- కన్నలి కాలువ, చెంబేడు కాలువల ప్రక్షాళన. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ.
- ఆటోనగర్ ఏర్పాటు.

చేసిన పనులు

- ఆలయంలో దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాం. ఇరవై ఏళ్ళగా ఆలయంలో పాతుకుపోయిన వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించా. మునుపు రోజువారీ రూ. 75 లక్షలు దాటని ఆలయ ఆదాయం ఇపుడు రూ. కోటి దాటుతోంది. ఆలయ పైకప్పునకు వాటర్ ప్రూఫ్ చేశాం. ఇదివరకూ పది వేల మందికి పెట్టే అన్న వితరణను 20 వేల మందికి పెంచాం.
- రూ. 55 లక్షల వ్యయంతో కన్నలి కాలువ పూడిక తీయించా.
- రేణిగుంట మండలం గాజులమండ్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రెండు నెలల కిందట సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇటీవలే మెగా జాబ్ మేళా నిర్వహించాం. 1788 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 712 మందికి అక్కడికక్కడే నియామకపుటుత్తర్వులు అందజేశారు.
- శ్రీకాళహస్తి, రేణిగుంటల్లో విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాం. శ్రీకాళహస్తి రాజీవ్ నగర్‌లో ప్రధాన రోడ్డు పక్కన 106 నిర్మాణాలు, లోపలి వైపు 82 నిర్మాణాలు అక్రమమని తేల్చి కూల్చివేయించాం. రేణిగుంటలో 90 అక్రమ నిర్మాణాలు కూలగొట్టించాం. మొత్తం 278 అక్రమ నిర్మాణాలు తొలగించాం.



రాజీవ్‌నగర్‌లో కూల్చిన అక్రమ నిర్మాణాలు

- శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని రూ. 35 లక్షల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేశాం. పిడియాట్రిక్ ఐసీయూ నిర్మాణంలో వుంది. మెటర్నటీ వార్డులో మెకానికల్ బెడ్లు ఏర్పాటు చేశాం. డయాలసిస్ యూనిట్ ప్రక్షాళన చేస్తున్నాం. ఆస్పత్రి అభివృద్ధికి అపోలో సంస్థతో చర్చిస్తున్నాం.



ఎమ్మెల్యే సొంత నిధులతో అభివృద్ధి చేసిన శ్రీకాళహస్తిలోని రెండో నెంబరు బాలిక వసతిగృహం

- ప్రభుత్వం ఇచ్చిన రూ. 40 లక్షలకుతోడు రూ.90 లక్షలు సొంత నిధులు వెచ్చించి శ్రీకాళహస్తిలోని నాలుగు హాస్టళ్ళలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచాం.
- రేణిగుంట నుంచీ షిర్డీ, వారణాసిలకు అలాగే కువైట్, చైనా, దుబాయ్‌లకు విమాన సర్వీసులు నడపాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరాను. ఏడాదిలోపు ఇవి జరిగే అవకాశముంది.
- గెలిచిన వెంటనే ఢిల్లీకి వెళ్ళి రైల్వే మంత్రిని కలసి శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధులు కోరా. మంజూరయ్యాయి. పనులు కూడా మొదలయ్యాయి.

మలి ఏడాది లక్ష్యాలు!

- ఏర్పేడులో శాశ్వత ప్రాతిపదికన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. దానికోసం 48 ఎకరాలు గుర్తించాం. ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభమవుతాయి.
- తొట్టంబేడు మండల పరిధిలో రెండు మూడు నెలల్లోనే ఆటోనగర్ ఏర్పాటవుతుంది.
- నియోజకవర్గంలో వరి, వేరుశెనగ పంటల సాగు ఎక్కువ. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్నర్‌షిప్ కింద గోదాముల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నా. మండలానికి ఐదు గోదాములు చొప్పున నిర్మించాలని ఆలోచన.

ఇవి చేయాలి.. చేస్తా!

- బాలాజీ రిజర్వాయర్‌కు సమయం పడుతుంది. దీనికి భారీగా నిధులు అవసరం. సీఎం చంద్రబాబు స్వయంగా రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.
- చెంబేడు కాలువ 24 కిలోమీటర్ల వరకూ ఆక్రమణలకు గురైంది. పూడిపోయింది. దీన్ని పునరుద్ధరించడానికి సాయం చేయాలని సీఎంను కోరా.
- సీఎం కరుణిస్తేనే మెడికల్ కాలేజీ కూడా వస్తుంది.

సోమశిల-స్వర్ణముఖి కెనాల్‌పై అసెంబ్లీలో : పెండింగ్ పనులు పూర్తి చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించా. కేవలం నాలుగైదు ఎకరాల అటవీ భూములకు కేంద్ర అటవీ శాఖ అనుమతి రావాలి. చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబును కోరా.

ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? ఎమ్మెల్యే గారూ.. శ్రీకాళహస్తి ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. అమలు చేయండి.

- పత్రి మురళి, చిల్లర దుకాణం యజమాని, శ్రీకాళహస్తి

! మా తండ్రి గోపాలకృష్ణారెడ్డి రూపొందించిన మాస్టర్ ప్లాన్ గత ప్రభుత్వం నిర్వాకంతో పెండింగు పడింది. ఒక డమ్మీ ఆర్కిటెక్‌ను పెట్టి రూ. 70 లక్షలు దుర్వినియోగం చేశారు. ప్రభుత్వ ఆర్కిటెక్ట్ ద్వారా ప్లాన్ అమలుకు చర్యలు మొదలుపెట్టాం. ఆలయానికి ఆనుకునివున్న 128 ఎకరాల దేవస్థానం భూములున్నాయి. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ భక్తుల సముదాయాలు నిర్మించేందుకు అంగీకరించాయి. ఇక తిరుపతి ఐఐటీ సహకారంతో ముక్కంటి ఆలయంలో పాలన, నిర్వహణ మొత్తం ఒక గొడుగు కిందకు తెచ్చేలా ఒక వ్యవస్థను అమల్లోకి తెస్తాం. మాస్టర్ ప్లాన్ అమలుకు రూ. 280 కోట్లు అవసరమవుతుంది. అన్నింటినీ ఆరునెలల్లో కొలిక్కి తెచ్చి పనులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? స్వర్ణముఖి నదిని ప్రక్షాళన చేస్తామని, నది కరకట్టను అభివృద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారని గుర్తు చేస్తున్నాను ఎమ్మెల్యేగారూ.

- వెలంపాటి కృష్ణ, వంట మాస్టర్, కాసరం గ్రామం

! ఆలయంతో ముడిపడివున్న స్వర్ణముఖి పవిత్రతను కాపాడుతునే యూరోపియన్ తరహాలో అభివృద్ధి పరుస్తాం. నది కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. ఈట్ స్ట్రీట్ తరహాలో అభివృద్ధి చేస్తాం. నెల రోజుల్లోనే వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రాబోతోంది.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



? శ్రీకాళహస్తిలో ప్రతిష్టాత్మకమైన స్కిట్ కళాశాల మూత పడింది. గెలిస్తే తిరిగి తెరిపిస్తామని ఎన్నికల్లో మీరు హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది.

- డాక్టర్ వెంకటరామన్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, శ్రీకాళహస్తి

! ఏ హామీ కూడా వదిలేయను. స్కిట్‌ను తెరిపిస్తున్నాం. రూ.5 కోట్లతో అవసరమైన పనులు చేపట్టాం. ఆలయ నిర్వహణలోనే వుంచి లీజుపై కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నాం. రెండు నెలల్లో మంత్రి నారా లోకేశ్ ద్వారా అడ్మిషన్లకు కౌన్సిలింగ్ నిర్వహించి తరగతులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు



డీవీజీ శంకర్రావు - శంకర్ జీవాల్ - రఘు

తిరుమల, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, తమిళనాడు డీజీపీ శంకర్ జీవాల్, సినీనటుడు రఘు ఉన్నారు.

శ్రీసిటీలో నైట్రోజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు

- నోవా ఎయిర్‌తో ఒప్పందం

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటులో భాగంగా నోవా ఎయిర్ టెక్నాలజీస్‌తో యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు నోవా ఎయిర్ సంస్థ సొంతంగా పైప్‌లైన్ వ్యవస్థ, ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ చేపట్టనుంది. శ్రీసిటీలో పారిశ్రామిక అవసరాలకు అంతరాయం లేకుండా దశలవారీగా ఈ ప్రాజెక్టు అమలుకానుంది. శ్రీసిటీని పారిశ్రామిక మౌళిక సదుపాయాలకు ఉత్తమ నమూనాగా మార్చే ప్రయాణంలో నోవా ఎయిర్‌తో భాగస్వామ్యం మరో ముందడుగుగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ఆవిష్కరణ, సుస్థిరత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలన్న తమ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. ఈ ఒప్పందం పట్ల నోవా ఎయిర్ టెక్నాలజీస్ ఎండీ అండ్ సీఈవో గజానన్ సబార్ సంతోషం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలోని సెజ్‌లకు పరిమితమైన యుటిలిటీ పైప్‌లైన్ నెట్‌వర్క్ సదుపాయం భారతదేశంలో ఈ తరహా చొరవ ఇదే ప్రథమం కావచ్చని వ్యాఖ్యానించారు.

28, 29 తేదీల్లో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి అర్బన్, జూలై 24: తిరుపతి రూరల్ తుమ్మలగుంట మైదానంలో 28, 29 తేదీల్లో బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఓ ప్రకటనలో తెలిపారు. '28న అండర్ 14, 16 బాలబాలికలకు, 29న అండర్ 8, 20 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయి. వీటిలో ఎంపికైన వారు వచ్చేనెల 9నుంచి 11వరకు జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు. ఆసక్తిగల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రం, ఆధార్ తీసుకురావాలి. మరిన్ని వివరాలకు 86868 67079 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో కోరారు.

టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోంది

- అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారు
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న చింతా మోహన్ తదితరులు

చిత్తూరు రూరల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో అంటరానితనం బాగా కనిపిస్తోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. చిత్తూరులోని గాంధీ విగ్రహం ఎదుట గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా దళితులు పనిచేశారన్నారు. ఇప్పుడు కనీసం ఒక్కరు కూడా కనిపించడం లేదని విమర్శించారు. కొండపైన వందలాది అంగళ్లలో ఒక్క ఎస్సీ, ఓబీసీ లేకపోవడం గమనార్హమన్నారు.ఇటీవల టీటీడీలో అన్యమతం పేరుతో దళితులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను మూసివేసి, మధ్యాహ్న భోజనం నిలిపివేసి పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు.బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ 11 ఏళ్లలో రూ.14.5 లక్షల కోట్ల దాకా బ్యాంకు రుణాలను మాఫీ చేసిందని, అయితే లబ్ధిదారులందరూ కోటీశ్వరులేనని తెలిపారు. మాఫీ అయిన రుణాల్లో సుమారు రూ.లక్ష కోట్లు బీజేపీ వసూలు చేసుకుందని ఆరోపించారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు చిత్తూరు జిల్లా వాసి అయినా చిత్తూరును అభివృద్ధి చేయలేదన్నారు.

- సమీక్షలు- సమావేశాలు

వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జులై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టి, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. సాధ్యమైనంత త్వరగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ, గిరిజన జిల్లా సంక్షేమాధికారులు భరత్‌కుమార్‌రెడ్డి, రాజా సోము, మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్తలు రేష్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

2029 నాటికి వందశాతం అక్షరాస్యత

జిల్లాలో 'ఉల్లాస్- అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తూ 2029 నాటికి వందశాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం ఆయన జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12,085 మంది వయోజనులను లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమం విజయవంతమైందని గుర్తుచేశారు. అదేవిధంగా ఈ ఏడాది 88,687మంది నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకుని బోధన తరగతులు నిర్వహించాలన్నారు. 15-59 ఏళ్ల వారికి చదవడం, రాయడం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. దీనికోసం ఆగస్టు 7న అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభించాలని వయోజనవిద్యాశాఖ అధికారి మహమ్మద్ అజాద్‌ను ఆదేశించారు. వయోజనశాఖ నోడల్ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీఈవో కేవీఎన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి తదితరులు పాల్గొన్నారు.

- రాష్ట్ర సెంట్రల్ వర్సిటీ పాఠ్యాంశంగా

'పల్లిపట్టు' రచన యాలైపూడ్సింది

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి పల్లిపట్టు నాగరాజు రచించిన 'యాలైపూడ్సింది' కవితా సంపుటికి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎంఏ తెలుగు ఆధునిక కవిత్వ విభాగంలో తెలుగు విద్యార్థులకు రెండవ సెమిస్టర్‌లో 'యాలైపూడ్సింది' కవితా సంపుటిని పాఠ్యాంశంగా చేర్చారు. సత్యవేడు మండలం రంగనాథపురం గ్రామానికి చెందిన పల్లిపట్టు నాగరాజు రాసిన కవితల సంపుటి 'యాలైపూడ్సింది'కి 2022లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. సమకాలీన వాస్తవికతను ప్రతిబింబిస్తూ, రాయలసీమ గ్రామీణ మాండలికంలో రాసిన 52 కవితల సంపుటి నాగరాజు తొలి రచన కావడం విశేషం. దళిత, బహుజన, గిరిజన కుటుంబాల జీవనశైలిలోని సౌందర్యాన్ని, శ్రామిక తత్వాన్ని, అట్టడుగు బతుకుల అగచాట్లను ఈయన కవితలుగా రాశారు. ఈ పుస్తకం ఉమ్మడిశెట్టి సాహిత్య అవార్డు వంటి ఎనిమిది అవార్డులను పొందింది. పల్లిపట్టు నాగరాజు ప్రస్తుతం వరదయ్యపాళెం జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.



పల్లిపట్టు నాగరాజు



రాయలసీమకు దక్కిన గౌరవం

యాలైపూడ్సింది కవితా సంపుటిని ఎంఏ విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టడం చాలా సంతోషంగా, గౌరవంగా ఉందని పల్లిపట్టు నాగరాజు అన్నారు. ఇది అట్టడుగు కుటుంబాల, గ్రామీణ జీవితాలకు, వారి భాషకు ముఖ్యంగా రాయలసీమ మాండలికానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని బాధితులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. 20 మంది లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం రూ. 14.73 లక్షలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, పురుషోత్తంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా అని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శివకుమార్, చంద్రయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, బాలరాజు, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

చిల్లకూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై పొదుపు సంఘాల సభ్యులకు గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రత్నయ్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాలలో మౌలికవసతుల కల్పనకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు జీవనోపాధికి తోడ్పాటు, అంటరానితనం, బాల్యవివాహాలను నిర్మూలించడం వంటి అంశాలపై ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు సుబ్రమణ్యం, పరశురామయ్య, వెంకటసుబ్బయ్య, రాగమ్మ, ఫకీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



గూడూరు అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామంలో గురువారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో ఓ గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గిరిజనకాలనీ చెందిన శివ అనే యువకుడు అతని చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందడంతో కుటుంబభారాన్ని మోస్తూ ఇబ్బందులు పడుతున్నాడు. శివ తన ఇద్దరు తమ్ముళ్లను, చెల్లెలను పోషిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబు, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్ ప్రారంభం



తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ తూర్పు వైపున పునరుద్ధరణ చేసిన ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్ భవనాన్ని గురువారం ఐజీ ఈశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూళ్లూరుపేటలో అధునాతన వసతులతో కూడిన ఆర్‌పీఎఫ్ పోలీసుస్టేషన్‌ను సిబ్బందికి అందుబాటులో తెచ్చామన్నారు. విధుల్లో ఉండే సిబ్బందికి మహిళలు, పురుషులకు వేర్వేరుగా వసతులు కల్పించామన్నారు. చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఎస్కార్టుగా వచ్చే ఆర్‌పీఎఫ్ పోలీసులు, సూళ్లూరుపేట నుంచి చెన్నైకి వెళ్లే సిబ్బందికి విశ్రాంతి తీసుకునేలా వసతులు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం విశ్వనాథ్, డీఎస్పీ రామకృష్ణ పాల్గొన్నారు.

నార్త్‌గిరిజన కాలనీలో 'తొలి అడుగు'



కోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణ పరిధిలోని నార్త్‌గిరిజన కాలనీలో గురువారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ దారా సురేష్, నౌషాద్, తూపిలి రాధాకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పుత్తూరు వార్తలు

కళలతో భక్తి మార్గం



హరికథను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ

పుత్తూరు టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కళలను ఆస్వాదిస్తే భక్తి మార్గం లభిస్తుందని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ అన్నారు. గురువారం పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల తిరునాళ్లలో భాగంగా 18 రోజుల పాటు జరిగే మహాభారత హరికథ కాలక్షేపాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం భాగవతారిణి స్వర్ణలత, వారి సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణప్ప మొదలి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్, కమిటీ సభ్యులు కేశవ, మునిచంద్ర పాల్గొన్నారు.

15 రోజుల గుత్త వసూలుకు వేలం

● రూ.2.84 లక్షలకు దక్కించుకున్న వేలందారుడు

పుత్తూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ పరిధిలోని ద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాల్లో తాత్కాలిక ప్రత్యేక మార్కెట్‌లో గుత్త వసూలుకు గురువారం నిర్వహించిన వేలంలో రూ.2.84 లక్షలకు అశోక్‌కుమార్ దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ గుత్త వసూలు ప్రక్రియ బ్రహ్మోత్సవాల ప్రారంభం కానున్న ఆగస్టు 1వ తేదీ నుంచి 15 రోజుల పాటు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ వేలంలో ఆరుగురు గుత్తదారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సత్యసాయి జిల్లా పీడీగా ప్రమీల

పుత్తూరు అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు ఐసీడీఎస్ సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న ప్రమీలకు పీడీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీగా ప్రమీల బదిలీ అయ్యారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కొనసాగుతున్న సీఐటీయూ దీక్షలు

వెంకటగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలంటూ సిఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం కూడా కొనసాగాయి. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పదేళ్ల నుంచి రామారావు ఇక్కడే పనిచేస్తున్నారని ఆరోపించారు. అతన్ని బదిలీ చేసేవరకు తాము ఆందోళనను విరమించబోమని స్పష్టం చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం

డక్కిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వైసీపీ మండల అధ్యక్షుడు చింతల శ్రీనివాసులు రెడ్డి ఆరోపించారు. గురువారం ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు డక్కిలిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్రావుల వేణుగోపాల్ నాయుడు, పెట్లూరు జగన్ మోహన్‌రెడ్డి, కొళ్లపూడి వేణుగోపాల్, బండి రమేష్, మురళీ, కోటి, అరుణాచలం, శంకరరెడ్డి పాల్గొన్నారు.

గోల్‌బాల్ క్రీడల్లో రాణించాలి



కలెక్టర్‌ను కలిసిన బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసయ్య

వెంకటగిరి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఈజిప్టు దేశంలో వచ్చేనెలలో బ్లైండ్స్ క్రీడాకారులకు నిర్వహించే జాతీయ స్థాయి గోల్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఎంపికైన బ్లైండ్స్ కీడాకారుడు వెంకటగిరికి చెందిన ముప్పాళ శేషగిరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పరుసూరు పెంచల నరసయ్య ఆధ్వర్యంలో శేషగిరి కలెక్టరును కలిశారు. క్రీడల్లో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లైండ్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ కన్వీనర్ రాజా తదితరులు ఉన్నారు.

అభివృద్ధి తక్కువ.. ప్రచారమే ఎక్కువ

వాకాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో అభివృద్ధి తక్కువ ప్రచారం ఎక్కువగా ఉందని వైసీపీ నాయకులు మేరిగ మురళీధర్ అన్నారు. గురువారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, రౌతు రామకృష్ణ, బూదనం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జయంపులో వైసీపీ ప్రచారం

బాలయపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జయంపులో గురువారం వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికార టీడీపీపై విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దత్తం సిద్దయ్య, ఎల్లంటి కృష్ణయ్య, వైసీపీ నాయకులు రాజారెడ్డి, వెంకటరమణారెడ్డి, గోపాల్ యాదవ్, వెంకటేశ్వర్లు, రామమూర్తి యాదవ్, లోకనాయుడు, సురేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీపై టీడీపీ విమర్శలు అర్థరహితం

కోట, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగినా టీడీపీ నాయకులు విమర్శలు చేయడం అర్థరహితమని వైసీపీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో గురువారం మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు మాట్లాడారు. గూడూరు వైసీపీ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్‌పై టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, నాగూర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, పాముల సురేంద్ర, కోటయ్య, విజయసారథిరెడ్డి, కోటారెడ్డి ఉన్నారు.

రామలింగచౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో గురువారం దేవాంగుల కులదైవమైన రామలింగ చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశిష్టరీతిలో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శేషగిరి, జగన్, చలమయ్య, చంద్ర, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సారూ ఎలా నడవాలో మీరే చెప్పండి..!?



అధ్వానంగా ఆర్డీవో కార్యాలయం రోడ్డు

సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షమొచ్చినా నీళ్లు నిలబడి ఇలా రొచ్చురొచ్చుగా మారుతోంది. ఆర్డీవో కార్యాలయానికి పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఆ అధ్వాన రోడ్డులోనే వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు అక్కడక్కడా గుంతలు ఏర్పడి నీరు నిలబడడంతో ద్విచక్ర వాహనదారులు ఆ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేట్ బ్యాంకు వీధిలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. - సూళ్లూరుపేట, (ఆంధ్రజ్యోతి)

అప్పుల్లో ఉన్నా హామీలు నెరవేర్చుతున్న చంద్రబాబు

ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ఇలుపూరులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు శంకరయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు

తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చుతున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం సూళ్లూరుపేట మండల పరిధిలోని ఇలుపూరు, మంగానెల్లూరు, మంగళంపాడు గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు. శంకరయ్య, కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఏలిమేటి సతీష్ మొదలి, శేషాద్రి, వంకా రమేష్, సుబ్రమణ్యం, తిరుపాల్, బుజ్జయ్య, మురళిరెడ్డి, ఎంపీడీవో ఏవీ మురళికృష్ణ, సీఐ మురళికృష్ణ, ఏవో కాంచన, ఎంఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీ-4 సర్వే పునఃపరిశీలన గ్రామ సభలు

ఓజిలి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన పీ-4 సర్వే పునః పరిశీల గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. గురువారం మండలంలోని తిరుమలపూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాలలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యవేక్షణలో స్థానిక పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తించిన బంగారు కుటుంబాల జాబితాలో ఎవరినైనా చేర్చాల్సి ఉన్నా, సవరించాల్సి ఉన్నా పరిశీలన చేశారు. దాంతోపాటు ఇంకా కొత్తగా బంగారు కుటుంబం కింద వచ్చేవారిని గుర్తించి నమోదు చేశారు.

పీడీఎస్‌యూ నూతన కమిటీ



కమిటీతో విద్యార్థి సంఘ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రతిభ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా యశ్వంత్, రాహుల్, సహాయకార్యదర్శిగా చైతన్య, ఉపాధ్యక్షులుగా విష్ణు, సుబ్రమణ్యం, ట్రెజరర్‌గా రామ్‌చరణ్‌లను ఎన్నుకున్నారు.

సిమెంట్ దిమ్మెలు తొలగించారు.. చెత్తను తీయడం మరిచారు



సిమెంట్ దిమ్మెలు ఉన్న చోట పేరుకుపోయిన చెత్త

సూళ్లూరుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని కచ్చేరివీధిలోని రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్మించిన సిమెంట్ దిమ్మెలు రైల్వేగేటు దక్షిణవైపు రోడ్డులో అడ్డంగా పెట్టేశారు. దీంతో ఆటువైపు రైల్వేగేటు వేసి తీసినప్పుడు ద్విచక్రవాహనదారులు వెళ్లాలంటే నిరంతరం ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజలు పలుసార్లు రైల్వే అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు రైల్వే అధికారులు భారీ క్రేన్‌లు తెచ్చి మూడు రోజుల క్రిం అడ్డంగా ఉన్న సిమెంట్ దిమ్మెలను తొలిగించారు. ఆ దిమ్మెలు కింద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని మున్సిపాలిటీ వారు చెత్తను తొలగించలేదు. దీంతో రెండు రోజుల నుంచి కుస్తున్న తేలికపాటి జల్లులకు ఆ చెత్తంతా కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు పక్కనే ఉన్న దుకాణ దారులు కూడా ఆ చెత్తలోనే చెత్తను వేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు స్పందించి అక్కడ చెత్తను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

హైస్కూల్ మైదానం చదును



తడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని బుల్‌డోజర్‌తో చదును చేస్తున్నారు. జనవరిలో జరిగిన పక్షుల పండుగకు వర్షం రావడంతో మైదానంలో సన్నని కంకర చిప్స్ పోశారు. మైదానంలో కంకర రాళ్లు లేచి గుంతలు పడడంతో వాకర్స్‌కు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రాళ్లపై నడకసాగించడం కష్ట తరంగా మారింది. దీంతో టీడీపీ నాయకులు వేనాటి సురేష్ రెడ్డి స్పందించి గురువారం మైదానంలో చదును చేసే కార్యక్రమం చేపట్టారు.

పోలీసు బందోబస్తు నడుమ మృతదేహం అప్పగింత



ప్రభుత్వ వైద్యశాల వద్ద గుమికూడి ఉన్న మృతురాలి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

నాయుడుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ బందోబస్తు నడుమ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాయుడుపేట షుగర్‌ఫ్యాక్టరీ సమీపంలో అత్త చెంగమ్మను అల్లుడు వెంకయ్య హత్యచేసిన సంఘటన విదితమే. అయితే చెంగమ్మ మృతదేహానికి గురువారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. చెంగమ్మ హత్యలో వెంకయ్యతోపాటు ఆయన సమీప బంధువుల పాత్ర ఉన్నట్లు మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించడంతో కొంత సమయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వ వైద్యశాల వద్ద అర్బన్ సీఐ బాబి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలు కుటుంబసభ్యులు ఆరోపించినట్లుగా వెంకయ్య బంధువులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

తుంబూరు పాఠశాల విలీనాన్ని ఆపాలి: ఏఐఎస్ఎఫ్



ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నారాయణవనం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తుంబూరు పాఠశాల విలీనాన్ని ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, మాజీ ఉపాధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలను యథావిధిగా కొనసాగించపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఈవో జనార్ధన్‌రాజుకు, తహసీల్దార్ జయరాములుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, ఇందుమతి, సారా భాగ్యరాజ్, గోవిందయ్య, ప్రసాద్, మునివేలు, చంద్రయ్య, రవి, రాము, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

1200 ఓట్లు దాటితే పంచాయతీల విభజనకు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సత్యవేడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): 1200 ఓట్లు దాటితేనే పంచాయతీలను విభజించుకునే అవకాశం ఉంటుందని తహసీల్దార్ రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలతో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ జాబితా తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు వారికి సంబంధించిన బూత్‌లెవల్ అసిస్టెంట్‌ల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలని కోరారు. పలు పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పుల గురించి చర్చించారు. ఇంటింటి సర్వే నిర్వహించేటప్పుడు మరణించిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించాలని పలువురు కోరారు. టీడీపీ నేత జడేరిబాబు, వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు బాలాజీ, నరేంద్రబాబు, రవి, గిరి, దిలీప్, సీపీఎం రమేష్, డీటీ వెంకటేశ్వరన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నాయకుల ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పవన్ కల్యాణ్ ఆశయసాధనలో భాగంగా గురువారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, లక్ష్మణ్, గంధం శ్రీను, నవీన్, మునిచంద్ర, చందు, సాయి, రాజా, మునికుమార్, వీరమహిళలు బత్తెమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలుఅలవరచుకోవాలని శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తి చేసే వరకు క్రమశిక్షణ, కఠోర శ్రమ అలవర్చుకుంటే సులువుగా చేరుకుంటారన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన, మాదక ద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధ్యాపకులు దుర్గారావు, జఫరుల్లాబేగ్, విజయసారథి, మనోహర్, గిరిప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, రాధ, గుణవతి, కందాటి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేకపూజలు



108 గుమ్మడికాయలతో కూష్మాండ బలి

ఏర్పేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మర్రిమంద వెలసిన శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయంలో గురువారం ఆషాడ మాసం సందర్భంగా బంగారమ్మ దేవికి ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. అమ్మవారికి 108 గుమ్మడికాయలతో కూష్మాండ బలి ఇచ్చారు. అదే విధంగా భక్తుల ఆధ్వర్యంలో కూష్మాండ దీప నివేదన జరిగింది. ఈ వేడుకల్లో గ్రామస్థులు గిరిప్రసాద్‌రెడ్డి, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు ఘన స్వాగతం



ఇంద్రసేనారెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రేణిగుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఎస్వీ మెడికల్ కాలేజీలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు గురువారం సాయంత్రం 4.45 గంటలకు హైదరాబాదు నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన పద్మావతి గెస్ట్‌హౌస్‌కు బయలుదేరి వెళ్లారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలపరచండి

● రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్



బీజేపీ జిల్లా కమిటీకి ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న కోలా ఆనంద్

రేణిగుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, కార్యవర్గ సభ్యులు యతేంద్ర రెడ్డి, రమణారెడ్డిలను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ రెడ్డి, నాయకులు రాజారాయల్, నరేష్‌రాయల్, పురుషోత్తం, అశోక్, హరీష్, భాస్కర్, ఆనంద్, మునివేలు తదితరులు పాల్గొన్నారు.

4నుంచి నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆగస్టు 4వ తేదీ నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ధ్వజారోహణం, 5న సూర్యప్రభ వాహనం, 8న నందిసేవ, 9న రథోత్సవం, 10న కల్యాణోత్సవం, 11న పార్వేట ఉత్సవం, 12న ధ్వజావరోహణం, 13న పల్లకీ సేవ, ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా వసంతోత్సవం



కేడిగ వాహనంపై ఊరేగుతున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యంస్వామి, పూజలుచేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయంలోని వసంత మండపం వద్ద ఈ వేడుకను నిర్వహించారు. వళ్లీ దేవసేన సమేత కుమారస్వామికి చందన, క్షీర తదితర అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఉదయం స్వామి అమ్మవార్లు కేడిగ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

కేవీబీపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం మనకు ఉండాలని సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు రామాంజుల నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. సాయిబాబా గుడి నుంచి సంతమార్కెట్ వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రభుత్వం సంవత్సరకాలంలో అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని నాయకులందరూ విభేదాలు విడనాడి ఒకే వేదికపైకి రావడం సంతోషకరమన్నారు. కళత్తూరు భూసమస్యపై కలెక్టర్‌తో మాట్లాడి, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ ఇక్కడ ఐక్యత చూస్తుంటే కుప్పం నియోజకవర్గం తరువాత ఈ నియోజకవర్గమే రెండవ స్థానంలో టీడీపీకి అండగా ఉంటుందని చెప్పారు. ఇన్నేళ్ల తరువాత మరలా సత్యవేడు నియోజకవర్గానికి కొత్త రూపు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే హేమలత చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గోపీనాథ్‌రెడ్డి, మునిస్వామియాదవ్, జయరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీపతి, సురేష్‌రెడ్డి, విజయకుమార్ నాయుడు, ప్రకాష్‌నాయుడు, బీజేపీ అధ్యక్షుడు బాబుయాదవ్, జనసేన మండల అధ్యక్షుడు థామస్, సాధిక్, అఖిల్, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ ప్రారంభం



ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం యార్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీన్ ప్యానెల్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఇంటింటికి వెళ్లి ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సన్మానిస్తున్న దశరథాచారి తదితరులు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): భారతీయ హస్తకళలు సాంస్కృతిక ప్రతీకలు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి హస్త కళాకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఘనంగా సత్కరించారు. శ్రీవారి దారువు శిల్పాన్ని బహూకరించారు. ఈకార్యక్రమంలో వన్నియ కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు ఉమేష్‌రావు, హరి, కొయ్యబొమ్మల కళాకారుడు జయముని ఆచారి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలి



మొబైల్ ఉచిత క్యాన్సర్ పరీక్షలను ప్రారంభిస్తున్న వైద్యులు

నారాయణవనం, జూలై 24(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి దర్శిత్‌రాజ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పీహెచ్‌సీలో పింక్ బస్సులలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించారు. దీంతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాగసుధ, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, సీహెచ్‌వో హరినాథ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీవల్లి, సూపర్‌వైజర్లు యశోదరమ్మ, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనివ్వలేదని 15రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయిన కిరణ్(15) అనే బాలుడిని గురువారం తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. డోన్‌కు చెందిన కిరణ్ సెల్‌ఫోన్ కొనివ్వలేదన్న కోపంతో ఇంటి నుంచి 15 రోజుల క్రితం వచ్చేశాడు. రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో బాలుడిని ఓ టీవీ రిపోర్టర్ గుర్తించి వివరాలు ఆరాతీశారు. దీంతో శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు ఆమె అప్పగించారు. పోలీసులు విచారణ చేసి డోన్‌కు చెందిన బాలుడిగా గుర్తించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గురువారం వచ్చిన తల్లిదండ్రులు, బాలుడికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించినట్లు సీఐ తెలిపారు.

పరశురామేశ్వరుడి సేవలో ప్రముఖులు

ఏర్పేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఏపీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన్ యోగేంద్రశర్మ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ కూడా దర్శించుకున్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐసర్ విద్యార్థికి అంతర్జాతీయ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్



ఆర్.విఘ్నేశ్వరన్

ఏర్పేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన పోటీతత్వ అంతర్జాతీయ పోస్టు గ్రాడ్యుయేట్స్ స్కాలర్‌షిప్‌కు ఐసర్‌కు చెందిన ఆర్.విఘ్నేశ్వరన్ అనే విద్యార్థి ఎంపికయ్యారు. యూకేలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో థర్మోఎలక్ట్రిక్‌ఫిజిక్స్, ఆర్గానిక్ సెమీ కండక్టర్స్ అప్లికేషన్‌పై కావెండిస్ లేబొరేటరీలో పీహెచ్‌డీ చేసినందుకు స్కాలర్‌షిప్‌కు ఆయన ఎంపికయ్యారు. హోర్డింగ్ డిస్టింగుస్డ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ 2025 సాధించినందుకు విఘ్నేశ్వరన్‌ను ఐసర్‌లో అధ్యాపకులు, శాస్త్రవేత్తలు అభినందించారు. ఈయన 2023లో జర్మనీలోని మార్క్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రేడియో ఆస్ట్రానమీలో వేసవి పరిశోధన ఇంటర్న్‌షిప్‌ను నిర్వహించినప్పుడు కూడా స్కాలర్‌షిప్‌ను అందుకున్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

రేణిగుంట, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని పిల్లపాల్యం స్వర్ణముఖినది తీరప్రాంతంలోని ప్రైవేటు భూముల్లో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లారు. రెవెన్యూ సిబ్బందిని చూసి ఇసుక అక్రమ రవాణా దారులు ట్రాక్టర్లను వదిలి పరారు కావడంతో 3 ట్రాక్టర్లను సీజ్‌చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3వేలు జరిమానా విధించి ట్రాక్టర్లను విడుదల చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

మద్యం స్వాధీనం - ఇద్దరి అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజా(38), మణి(57) అనే ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లావణ్య తెలిపారు. వీరిలో రాజాను తొట్టంబేడు మండలం చిన్నకనపర్తి వద్ద, మణిని పల్లంపేట మార్గంలో అరెస్టు చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ప్రముఖ న్యాయవాది గౌస్‌బాషా సోదరుడు షేక్ బాబు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డికి గురువారం అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. పట్టణాధ్యక్షుడు విజయకుమార్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్‌లో పగిలిన అద్దాలు

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్ఆర్ సినిమా థియేటర్‌లో ప్రధాన ద్వారం వద్ద అద్దాలు ధ్వంసమయ్యాయి. బుధవారం రాత్రి హరిహరవీరమల్లు సినిమా విడుదల సందర్భంగా ఆర్ఆర్‌లో ప్రీమియర్‌షో వేశారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ అభిమానులు అధికసంఖ్యలో థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఆసమయంలో జరిగిన ఘర్షణలో థియేటర్ ప్రధాన ద్వారం వద్ద ఉండే అద్దాలు పగిలిపోయాయి. థియేటర్ నిర్వాహకులు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోపి ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ద్వారా అద్దాలు పగులగొట్టిన వారి వివరాలను విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పవన్ అభిమానుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న పవన్ అభిమానులు

వరదయ్యపాళెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా వరదయ్యపాళెంలోని గౌరీశంకర్ థియేటర్‌లో విడుదల అయింది. దీంతో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ శ్రీను ఆధ్వర్యంలో థియేటర్ వద్ద సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. వెంకటేశ్వర్లు, జానకిరామయ్య, రెడ్డిశేఖర్, సాగర్, శ్రీధర్, దొడ్డి శేఖర్, చిరంజీవి, విజయకుమార్, నిర్మల్, పురుషోత్తం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసన



నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

కేవీబీపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసులో అరెస్టు అయిన ఎంపీ మిథున్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలంటూ గురువారం కేవీబీపురంలోని వైసీపీ కార్యాలయం నుంచి రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు నిరసన తెలుపుతూ నేతలు ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, లాలుబాబుయాదవ్, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ అయ్యప్ప, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, సరస్వతి, నందకుమార్, జాకీర్, వర్మ తదితరులు పాల్గొన్నారు.

● పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి: పిచ్చాటూరులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ నినాదాలు చేశారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

ఏర్పేడు, జూలై 24(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారి అభివృద్ధికి కృషి చేయాలని మండలంలోని బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజవేలు అన్నారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ శిరీష, చంద్రశేఖర్, భారతి, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి



మెటర్నిటీ టేబుల్స్‌ను దాత నుంచి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని ఆదర్శవంతంగా అభివృద్ధి చేసి పూర్వప్రతిష్ఠను తీసుకురావడమే ధ్యేయంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీని గురువారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్యే పర్యటించి పలువార్డుల్లో నూతన పరికరాలను సమకూర్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎంతో కృషి చేసి నెలకొల్పారని చెప్పారు. తన తల్లి బృందమ్మ ప్రభుత్వాస్పత్రిని దత్తత తీసుకుని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని వివరించారు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వాస్పత్రిని పట్టించుకోకపోవడంతో అన్ని వసతులు నిర్వీర్యమైపోయాయన్నారు. దీంతో రోగుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. తిరిగి ఆస్పత్రి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా ప్రత్యేక దృష్టి సారించి దాత సాయంతో అధునాతన ఖరీదైన సదుపాయాలు, వసతుల కల్పన సాగిస్తున్నామన్నారు. గురువారం తన స్నేహితుడైన ఆశ్రిత ఇన్‌ఫ్రా అధినేత డీవీఎస్ శ్రీధర్‌వర్మ రూ.5లక్షలతో కాన్పుల సమయంలో ఉపయోగించే మెటర్నిటీ టేబుళ్లను వితరణ చేసినట్లు వెల్లడించారు. అనంతరం పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ మణికి అందజేశారు.

ఆరేళ్ల తరువాత అభివృద్ధి కమిటీ ఎన్నిక

ఆస్పత్రికి తిరిగి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందుకోసం వివిధశాఖల అధికారులతో చర్చించి గురువారం కమిటీని నియమించారు. ఆస్పత్రిలోని పరిపాలన చాంబర్‌లో చైర్మన్‌గా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీ ఆస్పత్రుల అభివృద్ధి విభాగం ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ శివరామిరెడ్డి, శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ సంజీవ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసరెడ్డి, పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు శంకరప్రసాద్‌రెడ్డి, టీడీపీ నుంచి నాగమల్లి వినయ్‌కుమార్, బీజేపీ నుంచి గరికపాటి రమేష్‌బాబు, జనసేన నుంచి మునికుమార్, తెలుగు మహిళా విభాగం నుంచి సుమతిని ఎన్నుకున్నారు. ఆస్పత్రి అధికారులు సభ్యులను సత్కరించారు. అనంతరం ఆస్పత్రిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మణి, సిబ్బంది అలీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేలిస్తేనే కాల్వను శుభ్రం చేస్తామంటున్నారు

● పంచాయతీ పారిశుధ్య సిబ్బందిపై 12వ వార్డు ప్రజల ఆరోపణ



మెట్లు నిర్మించడంతో పూడిపోయిన మురుగుకాల్వ, ఇళ్ల మధ్యలో నిలిచిపోయిన మురుగునీరు

రేణిగుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రూ.20 వేలు ఇస్తేనే మురుగు కాల్వలను శుభ్రం చేస్తామని రేణిగుంట పంచాయతీ పారిశుధ్య సిబ్బంది డిమాండ్ చేస్తున్నారని, ఈ విషయంపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని 12వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం 12వ వార్డు ప్రజలు మీడియాతో మాట్లాడుతూ ఈ వార్డులో చెత్తను వారంలో ఒకరోజు మాత్రమే శుభ్రం చేస్తున్నారని, ఏడాదిగా మురుగు కాలువలో సిల్ట్ తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుందని తెలిపారు. ఒక ఇంటి ముందు మురుగు కాలువపై మెట్లు నిర్మించడంతో కూడా నీరు వెళ్లడం లేదని చెప్పారు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో పలువురు కిందపడి గాయాలపాలవుతున్నారని అన్నారు. దోమలు పెరిగిపోయి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారం రోజులుగా పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా మండల అధికారులు దృష్టి సారించి 12వ వార్డులో మురుగు కాల్వను పూడ్చివేసిన ప్రాంతాన్ని శుభ్రం చేసి, మురుగునీరు కిందకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మాధవిని వివరణ కోరగా, ఈ సమస్య తన దృష్టికి రాలేదని, రేపటి నుంచి 12వ వార్డులో మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తామన్నారు.

అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం పాటుపడిన జాషువా



జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 24: అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం పాటుపడిన మహా వ్యక్తి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి తెలిపారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాహిత్యంలో తన పదునైన కవిత్వం ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి ఆలోచింపజేసిన మహాకవి గుర్రం జాషువా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ప్రసాద్, నాదెండ్ల మురళి, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. యశ్వంత్‌రావు, జయగణేష్, బాలాజీరావు, రాజశేఖర్, డాక్టర్ కృపానిధి, లోకేష్‌యాదవ్, అరుణ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతన దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యాధికారి డాక్టర్ వెంకటభాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆగస్టు 31లోపు, ఇంటర్ డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చేసే విద్యార్థులు అక్టోబరు 31వ తేదీ నాటికి సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం



భూమిపూజ చేస్తున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని రామచంద్రాపురంలో లోవోల్టేజీ సమస్యను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిష్కరించారు. లోవోల్టేజీతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో గురువారం విద్యుత్‌శాఖ ఏడీఈ సుధాకర్, ఏఈ బాలాజీ సిబ్బందితో అక్కడికి చేరుకుని 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. గతంలో రామచంద్రాపురానికి అగ్రికల్చరల్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా చేసేవారు. ఇపుడు 24 గంటలు త్రీఫేస్ సప్లై ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు. తొట్టంబేడు టీడీపీ మండలాధ్యక్షుడు రావిళ్ల మునిరాజా నాయుడు, నాయకులు సరోజమ్మ, కొన్నలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖలో సిబ్బంది కొరత తీర్చండి

వరదయ్యపాళెం, జూలై 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో ఖాళీగా ఉన్న సిబ్బంది కొరతను భర్తీ చేసి ఈక్రాప్ నమోదు చేపట్టాలని టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఏవో గౌరిని కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ సిబ్బంది కొరత వలన రైతులు ఈ క్రాప్ నమోదు చేయలేకపోతున్నారన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకుంటే రైతులకు అదనంగా బస్తాకు రూ.300 ఆదాయం వస్తుందని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ విషయాన్ని సత్యవేడు ఏడీ, జిల్లా పీడీకి ఏవో గౌరి తెలపగా.. త్వరలోనే భర్తీ చేస్తామని వారు హామీ ఇచ్చారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు



రైల్వేస్టేషన్లో మానవ అక్రమరవాణాపై కరపత్రాలను చూపుతున్న అధికారులు

రేణిగుంట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. జూలై 30వ తేదీన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్సిస్ టూ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్టు ద్వారా ప్రగతి సంస్థ గురువారం రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో రైల్వే స్టేషన్లో మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ మాట్లాడుతూ రైళ్లల్లో ప్రయాణం చేసేటప్పుడు ఎవరైనా పిల్లలను తీసుకువెళ్తున్నారని అనుమానం కలిగితే 1098, 18001027222 టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం శేషగిరినాథ్ రెడ్డి, ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, ధనరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.